నేను బానిసను కాను

ఫాను వేగంగానే తిరుగుతూంది. కృష్ణమూర్తి కలం చాలా చిరాగ్గా, మెల్లగా కదులుతూంది.

వెచ్చటిగాలి ఫాను రెక్కల మధ్య చిక్కుకుని అక్కడే, ఆ కుర్చీల చుట్టూ ప్రదక్షిణలు కొడుతూంది.

బయట ఉన్న 'నో వేకెన్సీ' బోర్డుకి భయపడి, గాలి సైతం చెట్టుకొమ్మల నుంచి ఇటు ఆఫీసులోని జీవాల్ని పలకరించేటందుకు వచ్చే సాహసం చెయ్యడం లేదు.

పాతబంగారం

వ్యసనాలకు బానిస అయిన వ్యక్తుల్ని మార్చడం అంత తేలికైన విషయం కాదని మనందరికీ తెలుసు. కానీ ఒక స్త్రీ సునాయాసంగా వ్యసనపరుడ్ని మళ్ళీ మామూలు మనిషిగా ఎలా మార్చగలిగిందో ఈ కథ చెబుతుంది.

1955 లో రచనా వ్యాసంగానికి శ్రీకారంచుట్టిన శ్రీ కాటూరు రవీంద్రత్రివిక్రమ్ వందల సంఖ్యలో వివిధ సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేసారు. 1974లో 'ఆంధ్రప్రభ' సచిత్ర వారపత్రికలో ప్రచురితమైన ఈ కథ ఆయన విశిష్ట రచనల్లో ఒకటి. అలనాటి పాఠకుల్ని విశేషంగా అలరించిన ఈ కథ ఇప్పటి తరం పాఠకుల్ని కూడా ఆకట్టుకుంటుందని మా విశ్వాసం.

కాటూరు రవీంద్రత్రివిక్రమ్

రెండు సంవత్సరాల క్రితం కొన్న వట్టివేళ్ళ తడికెలు నీళ్ళకి జావకారి 'వట్టి తడికెలుగా' వేళ్ళాడుతున్నాయి. సువాసన మాట ఎలాఉన్నా, పాతబడిపోయిన వాసన ముక్కుపుటాలకు చాలా ఇబ్బంది కలిగిస్తుంది.

కొంతమంది ఆ వాసనకి అలవాటు పడిపోయారు. పడనివాళ్ళలో మొదటివాడు కృష్ణమూర్తి. అతని ముక్కు చాలా నైశిత్యం గలది. దానికి అద్భుతమయిన ఘ్రాణశక్తి ఉంది. వాసనని బట్టి రుచులు ఊహించుకోగల భోగట్టా మెదడుకు అందించే నేర్పు ఉంది.

"ఏమిటోయ్, సుబ్బన్నా! ఈ మినపట్టు మధ్య ఉల్లిపాయలు వేగినట్లు లేవే" అనేస్తాడు, ప్యూన్ పొట్లం విప్పగానే.

లేదా – "ఈ ఇడ్లీ ప్రొద్దుటిది! వేడి చేసి పంపాడు అయ్యరు" అంటాడు.

సుబ్బన్న ఆశ్చర్యంతో తలమునకలైపోతాడు.

"ఏమయ్యా, అయ్యరూ! ఇడ్లీ నిలవదట గంద – మా హెడ్‌గుమాస్తాగారన్నారు" అన్నాడోమాటు, నిజం తెలుసుకుందామని.

"హోటలన్నాక అవన్నీ మామూలే, సుబ్బన్నా" అని గారపళ్ళు వెళ్ళబెట్టి నవ్వాక, సుబ్బన్న ముక్కు మీద వేలేసుకున్నాడు.

"కృష్ణమూర్తిగారిది మా పెద్ద బుర్ర" అని ఆశ్చర్యం వెళ్ళబోసుకున్నాడు ఇతర ప్యూన్ల ముందు.

"ఒట్టి తిండిపోతు పంతులు! ఆయనకి తెలీకపోతే నీకేటి తెలుస్తది చద్దన్నం తినేవోడికి" అని కొట్టిపారేశారు వాళ్ళు.

ఎన్నన్నా, కృష్ణమూర్తి మీద సుబ్బన్నకు గౌరవం పైస తగ్గలేదు. అతనికేంకావాలో, ఎప్పుడు కావాలో సుబ్బన్నకి తెలిసినంత బాగా కట్టుకున్న పెళ్ళానికిక్కూడా తెలియదేమో!

కృష్ణమూర్తికి ఒక్క దుర్గుణం ఉంది. చార్మినారు లేకుండా అతని పెదవుల్ని చూసినవాళ్ళు దాదాపు లేరనే చెప్పాలి. ఆరిపోతున్న సిగరెట్టుకే కొత్తది ముట్టించేస్తాడు.

ఈ ఒక్క అలవాటుని మాత్రం సుబ్బన్నతో పాటు చాలామంది అంతరంగంలోనే గర్హించారు. ఎవరు చెబుతారు మొహం మీద గుద్దినట్లు?

కట్టుకున్న ఆడది కనుక కళ్యాణి కాళ్ళు, గడ్డం పట్టుకుని బతిమా

లింది. నిర్లక్ష్యంగా ఓ నవ్వు నవ్వి ఊరుకున్నాడు కృష్ణమూర్తి.

మళ్ళీ ఆ మాట ఎత్తలేదు ఆ ఇల్లాలు.

కానీ ఎర్రటి ఆ పెదవులు కమిలిపోయి నల్ల బడిపోయినప్పుడు, సిగరెట్టు పట్టుకునే వేళ్ళ కొసలు పొగబారినట్లుండటం గమనించినప్పు డల్లా మింగలేని, కక్కలేని బాధతో గిలగిల్లాడి పోతూ ఉంటుంది.

వారపత్రికలు తిరగేస్తుంటే ఎక్కడన్నా సిగ రెట్టు వల్ల జరిగే అనర్థాలు గురించి కనిపిస్తే చాలు, సీరియల్ కంటే ఆసక్తిగా కనీసం రెండు మార్లయినా చదువుతుంది.

ఆ రాత్రి ఆమె నిద్ర నిండా భయంకర స్వప్నాలు!

భర్త అస్థిపంజరంలా అయిపోయి మంచా న్నంటి పెట్టుకుని ఉంటాడు. "ఖళ్ళు, ఖళ్ళు" మని గది గోడలు కంపించేలా, కప్పు కూలి పోయేలా దగ్గుతుంటాడు. చివర్న పుడిసెడు నెత్తురు వమనం చేసుకుంటాడు. ప్రాణాలు కళ్ళల్లో ఉంటాయి. డాక్టరు వచ్చి పోతుంటాడు. ఓ రోజు మరీ ఎక్కువగా దగ్గుతాడు. నెత్తురు కళ్ళు చెదరగొడుతుంది. పిల్లలు అది చూసి భయంతో తనను కావలించుకుని ఏడుస్తుంటా రు. డాక్టరు వచ్చి పరీక్షిస్తుంటారు. తీతువుపిట్ట హృదయవిదారకంగా గుండెల్ని చీలుస్తూ వికృ తంగా అరుస్తుంటుంది. డాక్టరు జాలిగా తన కేసి చూస్తు "అయామ్ సారీ..." అంటాడు. తను గొంతు చించుకుని గొల్లుమంటుంది.

అప్పటిదాకా ప్రశాంతంగా నిద్రపోతున్న కృష్ణమూర్తి అదిరిపడి లేచి, "ఏమిటేమిటి?" అంటాడు లైటు వేస్తూ.

కళ్యాణి సిగ్గుతో ముడుచుకుపోతుంది. ఏమంటుంది? ఏమని చెప్పగలదు!

"ఏదో పీడకల" అంటుంది, ఓ గ్లాసెడు నీళ్ళు గడగడ తాగి అటు తిరిగి పడుకుంటూ.

ఇలా రెండుమార్లు జరిగాక కృష్ణమూర్తి విసుక్కోవడం మొదలెట్టాడు.

"అతిగా తినబోకు. అజీర్తి వల్ల కూడా పిచ్చి కలలు అనేకం వస్తాయి". ఆ మాట అంటూ సిగరెట్టు ముట్టించుకునేవాడు. నిద్ర ముంచు కుని వచ్చేదాకా అలా పెదవుల మధ్య సిగరెట్టు తప్పదు!

ఇది మరీ సహించరానిదయింది ఆమెకి.

ఏమైతేనేం కృష్ణమూర్తి అలవాటు మార లేదు, కళ్యాణికి పీడకలలు తప్పలేదు.

ఓ మాటు కాన్సరు వల్లా, మరో మాటు గుండెజబ్బువల్లా వ్యాసాల్లో డాక్టరు చెప్పిన రోగాలన్నింటితోనూ తీసుకుని చస్తూ, బతు కుతూ ఉండడం మామూలయిపోయింది, ఆమె కలల్లో కృష్ణమూర్తికి.

కళ్యాణి మనస్సు ఎంత పిరిగ్గా తయా రయిందంటే భర్తకు వేడి చేసి దగ్గు వచ్చినా ఉలిక్కిపడేది. దగ్గినప్పుడల్లా సుత్తితో తలమీద మోదినట్లు, కత్తులతో చెవుల్లో పొడుస్తున్నట్లు ఏమిటేమిటో రకరకాలుగా అనిపించేది.

"వెళ్ళి డాక్టరుకోమాటు చూపిద్దురూ" అని పోరు పెట్టేది.

"నేనంత త్వరలో టపాకట్టన్లే భయపడకు" అనేవాడు కృష్ణమూర్తి నిర్లక్ష్యంగా.

అతని నిర్లక్ష్యం ఆమెని మరింత భయ పెట్టేది.

పిల్లలు ఎదుగుతున్నప్పుడయినా భర్తలో పరివర్తన కలుగుతుందేమోననుకుని మోస

పోయింది.

"పిల్లల్ని చూసయినా మీరు మారకపోతే ఎలా? మొన్న మీరు పారేసిన ఎంగిలిపీక నోట్లో పెట్టుకున్నాడు వాసు. చెవులు మెలేసాను వెధవని..." అది కట్టుకథే. అతన్ని భయపెట్టాలని చెప్పింది.

ఆశించిన కదలిక లేదతనిలో.

ఫైలు తిరగేస్తూ, "పిల్లలు కదూ? వాళ్ళకేమీ తెలియదు. పైన నువ్వున్నావుగా. జాగ్రత్తగా చూస్తుండు. ఇల్లు శుభ్రంగా ఉంచుతుంటే సరి".

ఉక్రోషం వచ్చి అవతలికి వెళ్ళిపోయింది.

"ఈ జన్మకు ఆయన మారరు..." అదీ ఆమెకు అర్థమయిన నిజం.

ఓ మాటు వాసు నిజంగానే ఎంగిలిపీక నోట్లో పెట్టుకునేసరికి కసితీరా బాదేసింది. ఆ రాత్రి వాడికి తీవ్రంగా జ్వరం వచ్చింది.

కళ్ళల్లో వత్తులు వేసుకుని గుబులు గుబులుగా వాణ్ణి కనిపెట్టుక్కూర్చుంది. కొండమీద వాడి కరుణ కోసం కన్నీటి తర్పణాలు ఆర్పించింది. ఆ రోజు తెల్లవారడం బాగా గుర్తు.

వాడు మళ్ళీ నవ్వాడు.

అంతే!

మళ్ళీ వాడిమీద చెయ్యి చేసుకోలేదు.

శివాజీని మహావీరుడిగా, సజ్జనుడిగా మార్చడానికి పుత్లీబాయి ఎన్ని బాధలు పడిందో, ఎన్ని కథలు చెప్పిందో జ్ఞాపకం చేసుకుని వాడి పెంపకం మీద అంత శ్రద్ధ చూపింది.

అటు తరువాత ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు.

కృష్ణమూర్తి మారలేదు!

* * *

"గురువుగారూ! ఈ అమ్మాయి మన కొత్త స్టెనో. మిస్ వీణ..." రామారావుని, అతని పక్కనున్న మేనక లాంటి అమ్మాయినీ చూసి ఉలిక్కిపడ్డాడు కృష్ణమూర్తి.

"నమస్కారమండీ" చేతులు జోడించింది వీణ.

ఆమె గొంతు పేరుకు తగ్గట్టుగానే ఉందనిపించింది కృష్ణమూర్తికి.

"నమస్కారం. వెల్‌కమ్ టు యూ" అన్నాడు వెయ్యి కాండిల్ బల్బులా మొహం పెట్టి.

"థాంక్యూ సోమచ్. నన్ను బాస్‌కి పరిచయం చేస్తారా?"

"ష్యూర్. ఫాలో మీ!" ప్యాంటు ఎగలాక్కుని ముందుకి నడిచాడు. వీణ అనుసరించింది.

నోటితో 'కమ్ సెప్టెంబర్' మ్యూజిక్ కొడుతూ సీట్లోకి వెళ్ళాడు రామారావు.

గుమాస్తాలందరూ ముసిముసిగా నవ్వారు.

మరో పదినిమిషాల్లో ఇద్దరూ తిరిగొచ్చారు. కృష్ణమూర్తికి సమీపంలోనే స్టెనో సీటు. అది చూపించాడు. థాంక్స్ చెప్పి కూర్చుంది.

పూర్వం మగ స్టెనో ఉండేవాడు.

హఠాత్తుగా అతని భార్య చనిపోవడం వల్ల రిజైన్ చేసి వెళ్ళిపోయాడు. అప్పట్నుంచీ ఖాళీగానే ఉంది. ఇటీవలి సెలక్షన్‌లో వీణ వచ్చింది.

ఆ ఆఫీసుకి ఆడగాలి సోకటం అదే ప్రథమం.

అందరిలో కుతూహలం వెల్లివిరితలలు వేస్తూంది. పనున్నా లేకపోయినా కల్పించుకుని మరీ కృష్ణమూర్తి దగ్గర కొస్తుండడం సాగించారు. ఏ మాత్రం అవకాశం ఉన్నా వీణతో రెండు మాటలు మాట్లాడటమో, అధమం ఓ



ఫోజు కొట్టటమో చేస్తుండడం మామూలయింది.

పూర్వం రెండు రోజులక్కూడా గడ్డం గీసు కోవడానికి బద్దకించే వాళ్ళిప్పుడు శుభ్రంగా తయారై వస్తున్నారు. కృష్ణమూర్తి ఆఫీసువేళలో పనామా, ఇంటి వద్ద చార్మినార్ అలవాటు చేసుకున్నాడు. డబ్బులు తక్కువగా ఉంటే పనామా పాకెట్‌లోనే చార్మినారు ఉంచుకుని తాగేవాడు.

వీటిల్లో కొన్ని మార్పులు గుర్తించిన ఆఫీ సరు – "మన ఆఫీసు చాలా ఇంప్రూవ్ అయి నట్లు కనిపిస్తూందీమధ్య! ఏమిటి విశేషం?" అన్నాడు.

"ఏముంది సార్, బాధ్యతలు అర్థం చేసు కుంటున్నారు మనవాళ్ళు..." అన్నాడు కృష్ణ మూర్తి.

"అద్సరే – స్టెనో సీటు నా గదిలోకి మార్పిస్తే ఎలా ఉంటుందా అని ఆలోచిస్తున్నాను" అన్నా డు, కుర్చీలో వెనక్కు వాలి పెన్సిల్‌తో ఆడు కుంటూ.

ఆయనకి నలభైఅయిదేళ్ళకు తక్కువుండవు!

"ఓరి నీ కరువు తగలడా!" అని మనసులో తిట్టుకుని పైకి – "దాన్దేముంది సార్, బాగానే ఉంటుంది. కానీ ఈ స్టీల్ కప్‌బోర్డులవీ తియ్యా లి. ఇవన్నీ సీక్రెట్ ఫైల్స్ కదా మరి..." నసి గాడు.

"ఆల్‌రైట్! ఇలాగే ఉండనీ..."

"అమ్మయ్య" అనుకుంటూ బయటపడ్డాడు. అతనికిప్పుడు బోలెడు సంతోషంగా ఉంది. తనకి ముప్పై అయిదేళ్ళు. ముగ్గురు బిడ్డల తండ్రయినా, మనసులో రసికత్వం, రంగులం టే మోజు చావలేదు. అయితే పెద్ద మనుషుల్లో జమ కనుక, పెద్ద గుమాస్తా కూడా కనుక పైకి అవేమీ తెలియనివ్వడు.

రామారావు కుర్ర గుమాస్తా, ఇంకా పెళ్ళి కానివాడు కనుక అల్లరి చిల్లరగా ఉన్నా ఎవరూ పట్టించుకోరు. ఏమీ అనరుకూడా.

వీణ చాలా చలాకీగా పని చేసుకుపోయేది.

ఆ పిల్లకో నేర్పు ఉంది.

చనువు సంపాదించి, ముక్కు పట్టుకుని ఆడించడం!

ఒక్కోసారి ఆమె విసుర్లకీ, ఛలోక్తులకీ చిత్తయిపోతుండేవాళ్ళు గుమాస్తాలు. మనుష్యుల్లో జూదస్వభావాన్ని ఆసరాగా తీసుకుని వాళ్ళని బాగా రెచ్చగొట్టేది. బెర్నార్డ్ షా, బైరన్... వీళ్ళంతా చూడని ఆడది కావాలి వీణ! లేకపోతే ఆవిడ విచిత్ర వ్యక్తిత్వానికి వాళ్ళో అద్భుతమైన జీవితసత్యాన్నో, నిర్వచనాన్నో ముడివేసి ప్రపంచానికి చాటి ఉండేవాళ్ళు.

ఆఫీసు వాళ్ళెప్పుడన్నా కలిసికట్టుగా కొత్త సినిమాకి వెళ్ళడం జరిగేది. అది కూడా వీణ ప్రోద్భలమే.

"రామారావుగారు కొత్త సినిమాకి టికెట్లు తీసుకురాలేరని పందెం!" మాటల మధ్య అందంగా ఈ మాట అతికించేది. అక్కడ ప్రారంభం!

పందెం, పై పందెం.

చివరకి రామారావు నానా గడ్డి కరిచి టికెట్లు తెచ్చి పందెం గెలిచేవాడు!

"మీరు నిజంగా ఎడ్వెంచరస్..." అనేది ప్రశంసగా.

రామారావు చొక్కా చిరిగిపోగల ప్రమాద స్థాయిలో ఛాతీ పెరిగేది.

ఇలా ప్రతి ఒక్కరూ ఏదో రీతిగా ఆమె ప్రశంసలు పొందినవాళ్ళే, ఒక్క కృష్ణమూర్తి తప్ప!

'నాకూ అలాంటి ఛాన్సు తగిలితే బావుండు'నని వంద సార్లయినా అనుకునుంటాడు. అది రానే వచ్చింది. రావడం కూడా మెరుపులా వచ్చి, పిడుగులా అతన్ని ఢీకొంది.

"కృష్ణమూర్తిగారు దేన్నయినా వదిలిపెడతారేమోగానీ, సిగరెట్టు మాత్రం వదలరు! ఆయన దానికి బానిస..."

ఆఫీసువాళ్ళంతా ఈ దెబ్బతో కృష్ణమూర్తి ఓడిపోక తప్పదన్నారు. కృష్ణమూర్తి మొహం ఎర్రబడింది, తెల్లబడింది, నల్లబడింది...

ఈ మూడు క్షణాల్లో ఓ నిర్ణయానికొచ్చి "నేను బానిసను కాను... కావాలంటే వదిలెయ్యగలను..." అనేశాడు బింకంగా.

పందెం, పైపందెం.

కృష్ణమూర్తి పాకెట్టులోని సిగరెట్లు తీసి, తాగే అలవాటు ఉన్న వాళ్ళకి పంచేసాడు.

ప్రపంచాద్భుతాలకి మరోటి జత చేయడానికి కొందరు సిద్ధపడితే "ఆ రేపీపాటికి మామూలు. అసలు మనం కనుమరుగుకాగానే ప్రారంభించేస్తాడు. అనకూడదు కానీ, అతను పెళ్ళాన్నయినా వదులుతాడు గానీ సిగరెట్టు వదల్లేడు" అనేసారు కొందరు.

కృష్ణమూర్తికి చెవుడు లేదు కనుక ఇందులో కొన్ని వినిపించి పట్టుదలను మరీ పెంచాయి.

కానీ -

అలవాటుపడ్డ ప్రాణం నిలవనియ్యడం లేదే! నాలుక తెగ లాగేస్తూంది. పెదవుల్లో దురద. పైగా తనని ఛాలెంజ్ చేస్తున్నట్లు దూరంగా తనిచ్చిన సిగరెట్లు విలాసంగా తాగుతున్న గుమాస్తాలు!

అతనికి ఒళ్ళు భగ్గుమంది.

వాళ్ళందర్నీ ఊకుమ్మడిగా చావగొడదామన్నంత కోపం వచ్చింది. మిస్ వీణ అందమయిన జడ తెగ్గోయాలని కూడా అనిపించింది.

బలవంతాన నిగ్రహించుకున్నాడు.

ఆఫీసు అయిపోయింది.

ఇంటికి వెళ్ళడానికి లేచాడు.

దార్లోనే అందుకుంది తలనొప్పి. అలవాటు చొప్పున కిళ్ళీకొట్టు దగ్గర ఆగి, పర్సు తీసి సిగరెట్లు కొనబోతూ ఆగిపోయాడు. అంతరంగ వేదిక మీద నిలబడి "బానిస, బానిస" అని మిస్ వీణ హేళనగా నవ్వుతున్నట్లనిపించింది.

తను చాటుగా తాగితే ఎవరికి తెలుస్తుంది?! ఈ బాధ తను తట్టుకోలేడు.

మహా మహా విశ్వామిత్రుడే నిగ్రహం కోల్పోయాడు. తను మానవుడు. మామూలు మనిషి. తనెందుకిలా బాధపడాలి?

"ఏం కావాలి సార్? చార్మినారా, పనామానా?" ఎరిగున్న పరిచయంతో కొట్టువాడడిగాడు.

ఉలిక్కిపడ్డాడు. "ఏమీ వద్దు, ఏమీ వద్దు" గొణుక్కుంటూ ముందుకు వెళ్ళాడు. అగ్గిపెట్టె చొక్కా జేబులో ఉంది ఒంటరిగా! వంటికి గుచ్చుకుంటూ తన మూగగోడు వెల్లడిస్తూంది.

ఏదో కోల్పోయినట్లు, సుస్తీ పడినట్లు ఇంటికి చేరుకున్న భర్తని చూసి కంగారుగా, "ఏమిటండీ, అలా ఉన్నారేమిటి?" అంది కళ్యాణి.

"ఎలా ఉన్నాను? ముందు ఓ కప్పు కాఫీ ఇవ్వు..." అంటూ అలసటగా కూలబడ్డాడు కుర్చీలో.

ఆ మర్నాడు గానీ ఆమెకు భర్తలోని మార్పు అర్థంకాలా! నిరంతరం వెలిగే సిగరెట్టు అతని పెదవుల మధ్య ఇప్పుడు లేదు!

"ఏమండీ! మీరు సిగరెట్టు మానేసారా?" అంది తెల్లబోతూ, నమ్మశక్యం కానట్లు చూస్తూ.

"ఏం? మానెయ్యలేనా?" భ్రుకుటి బిగించి అడిగాడు.

నవ్వింది. "మీరా? ఇంకా నయం! అందుకా అలా ఉన్నారు? కొత్త అలవాటు ఎంత కష్టమో, పాత అలవాటు మానడం అంత కష్టం..."

అతనికి అవమానమనిపించింది. "చాల్లే ఊరుకో. నేనంత నిగ్రహం లేనివాణ్ణి కాను" చరాలున వెళ్ళిపోయాడు బయటికి.

ఓ వారం తరువాత బజార్లో అడిగారతన్ని "ఏమిటి? ఏదోలా ఉన్నారు నీరసంగా. ఏదన్నా నిరాహారదీక్షలో ఉన్నారా?" అని.

నవ్వేసి "అలాంటిదే"నని తప్పించుకున్నాడు.

మిస్ వీణ అతని నిగ్రహాన్ని ప్రశంసించి, ఓటమి అంగీకరించింది. ఆ రోజు పార్టీ, సినిమా. "మళ్ళీ సిగరెట్టు ముట్టుకోనని" వాగ్దానం తీసుకుని అతనికో పెన్ బహూకరించింది వీణ. అతనికి ఇంద్ర పదవి దొరికినంత ఆనందం కలిగింది. ఆ ఆనందంతో వళ్ళు తేలిపోతున్నట్లు, కళ్ళు మూతబడినట్లు అనిపించింది.

ఆస్పత్రిలో అతనికి తెలివొచ్చాక, అవసరమయిన పరీక్షలు ముగించిన డాక్టరు – "మీరు ఛెయిన్ స్మోకర్ అనుకుంటాను. 'లంగ్ కాన్సర్' రెండవ దశలో ఉంది. సిగరెట్లు తక్షణం మానేస్తే గానీ లాభం లేదు. ఇట్ ఈజ్ ప్రికాషన్!" అంటూ బయటికెళ్ళిపోయాడు. ●

'నీ కాబోయే భర్త భవిష్యత్ గురించి తెలుసుకోవాలనుకొంటున్నావన్న మాట' అన్నాడు జ్యోతిష్యుడు.

'అబ్బే... భవిష్యత్ గురించి తెలుసుకొనేదేముంది? అది నా చేతుల్లోనే ఉంటుంది కదా! అతని గత చరిత్ర గురించి చెప్పండి చాలు' అందా యువతి.